


చొప్పదండిలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డ ఓటర్లు (ఫైల్)




- సిట్టింగులకు కలిసిరాని నియోజకవర్గం
- ఒకసారి గెలిచిన వారికి మరోసారి దక్కని విజయం
- 24 ఏండ్లుగా అదే సంప్రదాయం
- ప్రతి అసెంబ్లీ ఎన్నికలో కొత్త వారికి అవకాశం

# చొప్పదండి.. విలక్షణం

గంగాధర, డిసెంబర్ 6 : చొప్పదండి నియోజకవర్గ ప్రజలు ప్రతి ఎన్నికలోనూ సిట్టింగులకు కాకుండా కొత్త వారికి అవకాశం ఇస్తున్నారు . 1999 నుంచి 2023 దాకా పరిశీలిస్తే.. ఇక్కడ ఒకసారి గెలిచినవారు తర్వాత ఎన్నికల్లో ఓటమి పాలవుతున్నారు. 1952లో చొప్పదండి నియోజకవర్గం ఏర్పడింది. అది అప్పుడు జనరల్‌గా ఉండేది. 1985 నుంచి వరుసగా మూడు సార్లు న్యాలకొండ రాంకిషన్‌రావు గెలిచినా.. ఆ తర్వాత నుంచి మాత్రం ఆనవాయితీకి బ్రేక్ పడింది. 24 ఏండ్లలో ఒకసారి గెలిచిన వారు మళ్లీ వరుసగా రెండో సారి మాత్రం గెలువలేదు. 1999లో ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న న్యాలకొండ రాంకిషన్‌రావుపై కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కోడూరి సత్యనారాయణగౌడ్ గెలుపొందారు. తర్వాత 2004లో సిట్టింగ్ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్‌పై టీడీపీ అభ్యర్థి సాన మారుతి విజయం సాధించారు. 2009లో చొప్పదండి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడుగా మారగా, అప్పుడు టీడీపీ తరపున సుద్దాల దేవయ్య గెలుపొందారు. 2014లో రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సుద్దాల దేవయ్యపై బీఆర్‌ఎస్ అభ్యర్థి బొడిగ శోభ గెలిచారు. ఇక 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున సుంకె రవిశంకర్ విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం గెలుపొందారు. ఈ లెక్కన చూస్తే గత 24 ఏండ్లుగా ఇక్కడి ఓటర్లు వినూత్నంగా తీర్పునిస్తున్నారు. ప్రతి ఎన్నికలోనూ కొత్త వారికి అవకాశం ఇస్తూ సరి కొత్త సంప్రదాయం కొనసాగిస్తున్నారు.

# తెరపైకి పంచాయతీ పోరు

- 2024 ఫిబ్రవరి ఒకటితో ముగుస్తున్న పాలకవర్గాల గడువు
- స్థానిక ఎన్నికలకు ఎస్‌ఈసీ కసరత్తు
- ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు
- పోలింగ్ కేంద్రాల వారీగా అధికారులను నియమించాలని ఉత్తర్వులు



కరీంనగర్, డిసెంబర్ 6 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను తాజాగా విడుదల చేసింది. ఆ ఆదేశాలు కలెక్టర్లకు అందడంతో యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించగా, పాలకవర్గాల పదవీకాలం 2024 ఫిబ్రవరి 1తో ముగుస్తున్నది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సమర్థవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేసుకోవాలని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. అంతేకాదు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో.. వారికి తగ్గట్టుగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలో నిర్దేశిస్తూ, స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఫిబ్రవరి ఒకటితో పదవీ కాలం ముగింపు

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (లెటర్ నంబర్ 921/టీఎస్ఈసీ-పీఆర్/2023) తాజాగా ఆదేశాలు జారీచేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలను 2029 జనవరిలో వివిధ దశల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించింది. నిబంధనల ప్రకారం 2024 ఫిబ్రవరి 1తో ప్రస్తుత సర్పంచులతో పాటు పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని 243(3)(ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నది. అంతేకాదు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని చెప్పింది.

## సిద్ధం కావాలని ఆదేశాలు

గడువు ముగుస్తున్న నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందిని నియమించడంతోపాటు పంచాయతీ ఎన్నికల కోసం సదరు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించింది. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల పరిధిలో సిబ్బందిని నియమించడానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. 200 ఓటర్లు ఉన్న పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ అధికారిని నియమించాలని సూచించింది. అలాగే 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు.. 401 నుంచి 650 వరకు ఓటర్ల ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించుకోవాలని ఆదేశించింది. ప్రతి వార్డులో ఒక పోలింగ్ బూత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, 650 దాటితే రెండు పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. సిబ్బందితోపాటు ప్రిసైడింగ్ అధికారులతో జాబితా సిద్ధం చేసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

## రెడీ అవుతున్న అధికారులు

ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు అందుకు అనుగుణంగా సిద్ధమవుతున్నారు. సర్పంచ్ ఎన్నికలు ఏ సమయంలోనైనా వచ్చే అవకాశమున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019 నాటి ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్లు పెద్ద సంఖ్యలో పెరిగారు. ఈ నేపథ్యంలో వార్డుల వారీగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయా జిల్లాల పంచాయతీరాజ్ శాఖ సిద్ధం చేస్తున్నది. దీంతో పాటు పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, పంచాయతీలు రిజర్వేషన్లు ప్రకటించాల్సి ఉంటుంది. దీనికోసం అధికారులు గణాంకాలను తీస్తున్నారు. అయితే ఎన్నికలు నిబంధనల ప్రకారం ఇన్‌టైంలో జరుగుతాయా..? లేదా..? అన్నది మాత్రం నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉండనున్నది.

# మిగ్‌జాం ముప్పు

- ఉమ్మడి జిల్లాలో

తుఫాన్ ప్రభావం.. పెరిగిన చలి తీవ్రత

- 23కు పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు
- రైతులను ఆగం చేసిన చిరుజల్లులు
- కల్లాల్లోనే ధాన్యపు కుప్పలు
- అక్కడక్కడా మోస్తరు వర్షం
- సగటున 6.4 వర్షపాతం నమోదు
- హుజూరాబాద్ డివిజన్‌లో అధికం





తమిళనాడు, ఆంధ్రాను అతలాకుతలం చేస్తున్న మిగ్‌జాం తుఫాన్, ఉమ్మడి జిల్లాను తాకింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ప్రజానీకాన్ని గజగజా వణికిస్తున్నది. క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జనం ఇండ్ల నుంచి బయటికిరాలేని పరిస్థితి నెలకొన్నది. అసలే చలికాలం దానికి తోడు గాలిలో తేమ మరింత పెరుగుతుండడం, ఆకాశం మబ్బులు పట్టి చిరుజల్లులు పడుతుండగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా హుజూరాబాద్ డివిజన్‌లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడుతుండగా, కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం ఉన్న రైతులు టార్పాలిన్లు కప్పుకుంటూ కాపాడుకుంటున్నారు.

**- కరీంనగర్, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ)**



పెద్దపల్లి: వాన గెరువు ఇవ్వడంతో నిమ్మనపల్లి కొనుగోలు కేంద్రంలో వడ్లు ఆరబోస్తున్న మహిళా రైతు

కరీంనగర్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ)/చొప్పదండి: మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో జిల్లా గజగజా వణుకుతున్నది. జనం ఇండ్ల నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. దీనికి తోడు తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తున్నాయి. హుజూరాబాద్ డివిజన్‌లో అక్కడక్కడా మోస్తరు వర్షం పడుతున్నది. మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నందున ఎండ కనిపించడం లేదు. బుధవారం పగటి ఉష్ణోగ్రతలు 23కు, రాత్రి ఉష్ణోగ్రతలు 20కి పడిపోయాయి. చలి విపరీతంగా పెరిగింది. ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రాకుండా ఉన్ని దుస్తులు ధరించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## అక్కడక్కడా వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన మిగ్‌జాం తుఫాన్ కారణంగా ఉమ్మడి జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం వరకు జిల్లాలో సగటున 6.4 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. హుజూరాబాద్‌లో 22.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఈ డివిజన్‌లోని మిగతా మండలాలైన ఇల్లందకుంటలో 9.2, జమ్మికుంటలో 7.2, శంకరపట్నంలో 7.8, సైదాపూర్‌లో 9.8, వీణవంకలో 5.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇక కరీంనగర్‌లో డివిజన్‌లోని చిగురుమామిడిలో 9.6, గంగాధరలో 2.6, రామడుగులో 3.2, చొప్పదండిలో 4.0, కొత్తపల్లిలో 2.2, గన్నేరువరంలో 5.2, కరీంనగర్‌లో 1.6, మానకొండూర్‌లో 2.4, తిమ్మాపూర్‌లో 3.8 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది.

## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం

మిగ్‌జాం తుఫాన్ రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెద్ద మొత్తంలోనే ఉండగా, యంత్రాంగం అప్రమత్తమైంది. రెండ్రోజుల నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నది. అన్ని జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఇపుడున్న పరిస్థితుల్లో 2.25 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. కాగా, ఇప్పటికే 1.82 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇంకా చాలా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండగా, తుఫాన్ బారినుంచి కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు.



సారంగాపూర్: లచ్చక్కపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు

## రంగుమారుతున్న వరి నారు

వానకాలం ధాన్యం సేకరణ దాదాపుగా ముగింపు దశకు వచ్చింది. ప్రస్తుతం యాసంగి ప్రారంభమవుతున్నది. నీటి సౌకర్యాన్ని బట్టి ఎప్పటిలాగే కొంత మంది రైతులు కాస్త ముందుగానే యాసంగి నారు పోసుకున్నారు. పదిహేను రోజుల క్రితమే పోసిన నారు మరో 15, 20 రోజుల్లో నాట్లు వేసుకునే దశకు చేరుకుంటుంది. ఈ దశలో మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో చలి పెరుగడం, మబ్బు పట్టి ఉంటుండడంతో అవసరమైనంత ఎండ నారుకు తగలడం లేదు. దీంతో ముందుగా పోసుకున్న నారు ఎరుపు రంగుకు మారే ముప్పున్నదని ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది. రంగు మారితే నత్రజని వాడాల్సిన పరిస్థితి వస్తుంది. కాస్త రంగు ఎక్కువ మారితే అదీ పని చేయదంటున్నారు. మరో వైపు ఈ సమయానికి నారు పోసుకునే రైతులు ప్రస్తుత చల్లని వాతావరణం తగ్గితే నారు పోయడానికి మొలకలు నానబెట్టుకోవడానికి ఎదురు చూస్తున్నారు. ఈ వాతావరణంలో పోస్తే మొలకెత్తిన నారు చల్లదనానికి, చిరు జల్లులకు మురిగి పోతుందని చెబుతున్నారు. మిగ్‌జాం ప్రభావం ఎప్పుడు తగ్గుతుందా..? అని ఎదురుచూస్తున్నారు.



చొప్పదండి: ధాన్యం పై కప్పిన కవర్లు



నర్సయ్య ఇంటి నుంచి మేతకు వెళ్తున్న గేదెలు

# 'పాడి'తో రాబడి

- ఆదర్శంగా నిలుస్తున్న నర్సయ్య దంపతులు
- పాతికేళ్ల నుంచి బర్ల పెంపకం
- రోజుకు 25 లీటర్ల పాల ఉత్పత్తి
- నెలకు వేలల్లో ఆదాయం

అనాదిగా పల్లె జీవనంలో ఒక్కటై పోయి కుటుంబాలకు జీవనాధారమైన పశుపోషణ కాలక్రమేణా మాయమైతున్నది. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో పశుపక్ష్యాదుల పెంపకం మరుగునపడుతున్నది. కానీ, సుల్తానాబాద్ మండలం తొగర్రాయికి చెందిన బొంగోని నర్సయ్యగౌడ్-సుగుణ దంపతులు పాడినే నమ్ముకొని బతుకున్నారు. బర్రెలు, ఆవుల పెంపకాన్ని బతుకుదెరువుగా మలుచుకొన్నారు. ఒక్కటికాదు రెండు కాదు 25 ఏండ్లుగా పాడిపైనే ఆధారపడి దర్జాగా బతుకుతున్నారు.

**- సుల్తానాబాద్ రూరల్, డిసెంబర్ 6**



పాలను గిన్నెలో పోస్తున్న బొంగోని నర్సయ్యగౌడ్

## రంది లేకుండ బతుకుతున్నం

నేను ఒకప్పుడు కల్లు గీత వృత్తి చేసుకుంటూ బతికేటోన్ని. అయితే అనారోగ్య సమస్యలతో 25 ఏండ్ల కింద ఆ పని మానేసిన. ఇల్లు గడుసుడు ఎట్లా అని మస్తు మందిపడ్డ. మొదట్ల ఒక బర్రెను కొన్న. మంచిగ లాభం అనిపించి మళ్లో రెండు కొన్న. ఇప్పుడు అవి 20కి పెరిగినయి. రోజుకు 25 లీటర్ల పాలు ఇస్తున్నయి. లీటర్‌కు 60 రూపాయల చొప్పున లెక్కేసిన నెలకు ₹45 వేల దాకా ఆదాయం వస్తున్నది. ఖర్చులన్నీ పోను ₹25వేలు మిగులుతున్నయి. వాటిని మంచిగా కాపాడుకుంటే మంచిగా పాలిస్తయి. నెలకు మూడు క్వింటాళ్ల తవుడు, ఆర్నెల్ల కోసారి గడ్డి కొనుగోలు చేస్తున్న. మేం ఇప్పుడు రంది లేకుండ బతుకుతున్నం.

**- బొంగోని నర్సయ్యగౌడ్, పాడి రైతు**

సుల్తానాబాద్ మండలం తొగర్రాయికి చెందిన నర్సయ్యగౌడ్ తన కుల వృత్తి కల్లు గీసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే కాలక్రమేణా వచ్చిన అనారోగ్య సమస్యల వల్ల 25 ఏండ్ల క్రితం కల్లుగీత వృత్తి మానేశాడు. చెట్టు ఎక్కి కల్లు గీసే పరిస్థితి లేక కుటుంబ పోషణ కోసం తన భార్య సుగుణ సహకారంతో బర్ల పెంపకం చేపట్టాడు. మొదట ఒక బర్రెను కొన్నాడు. రోజూ రెండు లీటర్ల పాలను గ్రామంలోని పాల కేంద్రంలో పోసేవాడు. ఏడాది తర్వాత మరో రెండు బర్రెలను కొనుగోలు చేశాడు. రెండేళ్లలో పశువుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం 20కి చేరింది. 18 బర్రెలు, 4 దూడలు, 17 చిన్న దూడలు, 2 ఆవులు ఉన్నాయి. వాటి విలువ ₹12 లక్షల దాకా ఉంటుందని నర్సయ్యగౌడ్ చెబుతున్నాడు. ఇంటి వద్దే కొట్టం ఏర్పాటు చేసి పశువులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. ప్రస్తుతం రోజుకు రెండు పూటలకు కలిపి ఐదు బర్లు బర్రెలకు 25 లీటర్ల పాలు ఇస్తుండగా, అందులో పది లీటర్ల పాలను 20 ఏండ్లుగా సుల్తానాబాద్ పట్టణంలోని ఓ స్వీట్ హౌజ్‌లో పోస్తున్నాడు. మిగతా పాలను వాడకందారులకు అమ్ముతున్నాడు.